# "ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు?"

నాకిప్పుడు ఎంతో ఆనందంగా వుంది. రాత్రి పదిగంటలు దాటింది. విశాలమైన నగర వీధులన్నీ దాదాపు నిర్జనంగా వున్నాయి. మెర్క్యూరీ లైట్లకాంతులు నున్నటి సిమెంటురోడ్డు మీదపడి కళ్ళకుఆహ్లాద-కరమైన అనుభూతి నిస్తున్నాయి.

నేను సంతోషంతో తేలిపోతూ నడిచిపోతున్నాను. హుషారుగాఈల వేస్తూ నడుస్తున్నాను, భుజాలమీద చిరుగులు పట్టినచొక్కానూ, ఆఫీసులో నలుగురి మధ్యా నాపరువును కాపాడుతూ వచ్చినపాతకోటువంకనూ చూసుకున్నాను. మాసిన గడ్డం చేతులతో తడుముకున్నాను. ఉంగటాలు చిరిగిన నా చెప్పుల వంక చూసుకున్నాను.

నా ఎదురుగా ఎవడోమనిషి నడివయసువాడు "నెత్తి మీదటోపీవాడు,

తూలుతూ నడిచి పోతున్నాడు. వాడుఏదో గొణుక్కుంటూ పోతున్నాడు. అదెప్పటి పాట? చిన్నతనంలో కాలేజీలో చదువుకునేరోజుల్లో, బరువులూ బాధ్యతలూ తెలీనిరోజుల్లో తీరిక చిక్కినప్పుడల్లా కళ్ళుమూసుకుని భవిష్యత్తును గురించి బంగారు కలలుకనే రోజుల్లో నేను విన్న పాట!

ఇప్పుడు నేను ఆనందంగా వున్నాను కాబట్టి, ఆఫీసులో ఎప్పటికీ కదలని ఫైళ్ళ పర్వతాలు కానీ, ఒకటిరెండు నిమిషాలు ఆలస్యమైతేచాలు నావంక తీక్షణంగా చూసే మా మేనేజరు కానీ, ప్రతి ఫష్టుతారీఖుసాయంకాలమూ నెలరోజుల చాకిరీకి ప్రతిఫలంగా నాచేతికందే కేవలం నూట యాభై రూపాయల జీతం కానీ (ప్రావిడెంటుఫండు, మాఆవిడ ఆరోకాన్పు కష్టమైనందువల్ల నేను తీసుకున్న లోనుమినహా) చాలీచాలని ఇల్లుకానీ.... ఇవేవీ ఇప్పుడు నామనసులో లేవు....

....వీరాంజనేయులు ఇవాళ ఎంతమంచిపని చేశాడు? ఇన్నేళ్ళుగా నామనస్సనే భయంకర మహాసముద్రంలో దోవ తప్పి ఏలోతులలోనో కూరుకు పోయిన నాబంగారుకలలను గుర్తుచేశాడు. పొద్దునఆఫీసుకురాగానే పదిమంది వీరాంజనేయులు చుట్టూమూగివుండటం చూసి, నేనూ అటు వెళ్ళాను. ఇటీవలనే సర్వీసులో చేరిన వీరాంజనేయులకు అంతలోనే ప్రమోషన్ వచ్చిందని విని ఆక్షణంలో మనసు కలుక్కుమన్న మాట నిజమే. ! కాని అతడిని మనస్ఫూర్తిగా అభినందించాను. అంతలోనే గుంపులోంచి "ఇవాళ ఆఫీసు కాగానే పార్టీ, సినిమా" అని ఎవరో కేకలు వేశారు. వీరాంజనేయులు అదివిని సంతోషంతో పొంగిపోతూ "తప్పకుండా బ్రదర్!" అనిఅప్పటి కప్పుడే అందర్నీ ఆహ్వానించాడు. తరువాత సాయంకాలం అయిదు గంటలవరకూ డెస్కుముందు కూర్చుని పని చేస్తూనే వున్నాను. కాని మనసు మాత్రం తేలికపడలేదు. పాపిష్టి మనసు. మాటిమాటికి నన్ను నేను ఓదార్చుకోవలసి వచ్చింది. నాతరువాత చేరిన

మనిషికి ప్రమోషన్ రావటమూ, నేను "ఎక్కడవున్నావే గొంగళీ" అంటే "వేసినచోటనేవున్నా"నన్నట్లు ఎప్పటికీఅలాగేవుండిపోవటమూబాధ కలిగించే విషయమే అయినా ఇది మొదటిసారికాదుగదా? ఎన్నిసార్లు ఇటువంటి ఓటమిని చిరునవ్వుతో సహించలేదు. ఎక్కడో పరుగు పందాలు జరుగుతూవుంటాయి. అందరూ ఒకలాగ పరుగెత్త గలరా? అదృష్టవంతులెవరో కొంతమంది ముందుపరుగెత్త గలుగుతారు. మిగిలినవారు వెనక పడక తప్పదు కదా? దానికి నిరుత్సాహ పడి ఏం ప్రయోజనం?

నే నిలాంటి పరుగుపందెంలో ఇరవయ్యేళ్ళుగా నురగలు కక్కుతూ ఆయాసంతో వగర్చుతూ పరుగెత్తి అలసిపోయిన వాడిని. నాకళ్ళముందే ఎందరో నాకంటే ముందు పరుగెత్తి పోయి బంగారుపతకాలు పొందారు. తోటివారి అభినందన లందుకున్నారు. తోటివారి మీద ఆధిపత్యం సంపాదించారు.

సాయంకాలం ఐదు గంటలకు గుంపుగుంపంతా ఆఫీసులో నుండి బయటకువచ్చి "ఎక్కడికి" అంటే "ఎక్కడికి" అనుకున్నారు. వీరాంజనేయులు చిరునవ్వు నవ్వుతూ అందర్నీ తన వెంట రమ్మన్నాడు. అందరం నడవడం ప్రారంభించాము. నేను నడుస్తూ వుండివుండి వీరాంజనేయులు వంక చూశాను. అతడు హుషారుగా వున్నాడు. ఆనందంగా వున్నాడు. అలా వున్నట్టు పైకి కనబడకుండా వుండేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతనిజుట్టు ఇంకా నల్లగానే వుంది. నా జుట్టువలె తెల్లబడిపోలేదు. అతని కళ్ళలో ఇంకా వెలుగుంది. హుషారు వుంది. "పుష్" అనబడే చొరవవుంది. ఇన్నేళ్ళుగా పెద్ద పెద్ద ఫైళ్ళతో వ్యవహరించడం వల్ల తలా తోకా లేని పొడుగాటి అంకెలతో వ్యవహరించడం వల్ల ఇటీవల నా కళ్ళకేదో రోగం వచ్చినట్టున్నది. ఎప్పుడో వీలుచూసుకుని డాక్టరు దగ్గరకు పోవాలి! చత్వారమో ఏమో? నడివయసు దాటుతున్నది కదా!

వీరాంజనేయులు మమ్మల్ని అలా నడిపించుకుంటూ ఒకానొక పెద్ద హోటలులోకి తీసుకు వెళ్ళాడు, అది ఇంద్రభవనంలా వుంది. చల్లగా హాయిగా వుంది. చక్కని అందమైన మనుష్యులతో నిండి వుంది. శుభ్రంగా విశాలంగా వుంది. అక్కడ ఫలహారాలు. కాఫీలు అయిన తర్వాత అంతా "పొలో" మంటూ సినిమాకు బయలుదేరారు....

....రోడ్డుమీద కళ్లు మిరుమిట్లుగొల్పే కాంతులతో ఏదో బస్సు వస్తున్నది. నేను పక్కను తప్పుకొని నిలబడ్డాను. బస్సు క్షణంలో బాణంలా ముందుకు దూసుకుపోయింది. నేను మళ్ళీ నడవడం ప్రారంభించాను.

ఇల్లు యింకా మైలు దూరం వుంది. ఈ విశాలమైన రాచబాటలన్నీ దాటి, ఇరుకు సందులగుండా పోయి, సందులు, గొందులు తిరిగి. ఆ రెండంతస్తుల భవనం వరండాలో నడుచుకుంటూ పోయి, ఎడమ ప్రక్కకు తిరిగి అక్కడ ఆగాలి. బహుశా సావిత్రి పిల్లలకు అన్నాలు పెట్టి, నిద్రబుచ్చి. నా కోసం ఎదురుచూస్తూ వుంటుంది.

ఆసినిమా గుర్తు వచ్చింది!....అదొక పంచ రంగులచిత్రం. సినిమా చూస్తున్నంత సేపూ నన్ను నేను మర్చిపోయాను, అసలు సినిమాచూసి ఎన్నేళ్ళో అయింది. ఆ సినిమాలో హీరో మన్మధుడిలా వున్నాడు. అందంగా. ఆనందంగా వున్నాడు. హుషారుగా, పొగరుగా వున్నాడు. జీవితంలో దేన్నీ లెక్కచేయని వాడిలా వున్నాడు. అతనికి బంగళాలున్నాయి. ఆ బంగళాల చుట్టూ అందమైన పూలతోటలున్నాయి. ఆ పూలతోటల్లో లెక్కలేనన్ని ఫౌంటెన్‌లున్నాయి. అతనికి కార్లున్నాయి. విమానాలున్నాయి. ఎప్పుడు, దేనిలో పోదల్చుకుంటే—దానిలో, ఎక్కడికి వెళ్ళిపోదల్చుకుంటే అక్కడికి క్షణంలో వెళ్ళిపోగలడు.

సినిమాలో హీరోయిన్ రతీదేవిలావుంది. అందంగా, ఆరోగ్యంగా హాయిగా ఆడుతూ పాడుతూవుంది. యౌవనంతో పిటపిటలాడుతున్నట్టున్నది. ముద్దు ముద్దుగా మనోహరంగా మాట్లాడుతున్నది. మాటిమాటికీ పాటలు పాడుతున్నది. నాట్యంచేస్తున్నట్లు నడుస్తున్నది.

ఆ సినిమాలో ప్రకృతి తెరమీద అంతా పచ్చపచ్చగా కనుపించింది. సస్యశ్యామలంగా కనిపించింది .జరారుజలులేని స్వర్గధామంలావుంది. అక్కడ కష్టాలులేవు. కన్నీళ్ళులేవు. సమస్యలులేవు. ఎప్పుడూ 'ఆకలో' అనే పిల్లలు లేరు. చారీచాలని ఇళ్ళులేవు. ఫైళ్ళులేవు. రెండు నిమిషాలు ఆలస్యంగా వెడితే, కోపంగా చూసే ఆఫీసు మానేజరు లేడు.

నేను నెమ్మదిగా నడుస్తున్నాను. ఇన్నాళ్లూ నా మనస్సనే మహా సముద్రంలో ఎక్కడో కూరుకుపోయిన చిన్ననాటి నా బంగారు కలలన్నీ గుర్తుకు వచ్చాయి. ఆవి హాయిగా బేఫర్వాగా తిరిగే రోజులు. ఆనందంగా హాయిగా గడిచిపోయిన రోజులు. బరువూ బాధ్యతలూ తెలీని రోజులు. విరామం దొరికితే చాలు. కళ్ళుమూసుకుని భవిష్యత్తును గూర్చి పంచెవన్నెల కలలుకనే రోజులు. ఆ రోజు లెక్కడికి పోయాయి? మళ్ళీ వస్తాయా?

నేను నడుస్తూనే చేతి వ్రేళ్ళతో జుట్టుపైకి దువ్వుకున్నాను. కోటు జేబుల్లో చేతులు పెట్టి, మళ్ళీ ఇవతలికి తీసేశాను. కొంచెం దూరం చేతులు వూపుకుంటూ నడిచాను. అంతలో నా చిన్ననాటి బంగారు కలలన్నీ వరుసగా గుర్తుకు వచ్చాయి.... మొదటి కలలో నేను పెద్ద పదవిలో వున్న ఆఫీసరును. నా అధీనంలో డజన్లకొద్దీ గుమాస్తాలుంటారు. వాళ్ళందరూ లెక్కకు మూడే మూడు పంకాలున్న పెద్దహాలులో కూర్చుని పని చేస్తుంటారు. వారిముందు బోలెడన్ని ఫైళ్ళుంటాయి. వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తుంటారు. నేను ఆ పక్కనే ఏర్ కండిషన్ రూములో

కూర్చుని వుంటాను. దానిమీద అందాలు చిందే పెన్‌స్టాండ్, అందాల బొమ్మలున్న క్యాలెండరు, కాలింగ్ బెల్, పక్కనే టీపాయ్ మీద ఫ్లవర్ వాజ్. బయట కాలింగ్ బెల్ శబ్దంకోసం ఎదురుచూసే విధేయుడైన నౌకరూ వుంటారు. జీతం సంగతి చెప్పనే అక్కర్లేదు, బుల్లికారు సంగతి సరే సరి!....

రెండో కలలో నా వైవాహిక జీవితం.... నేను ఏరికోరి చేసుకున్న అందాల చిన్నది. నాకువిధేయురాలైన ఉత్తమ ఇల్లాలు. మాకు మహా అయితే ఒక్కళ్లో ఇద్దరో ఆరోగ్యవంతులైన పిల్లలు. మా కారులో ప్రతి సాయంకాలమూ ఎటో బయలుదేరి వెళ్ళి షికార్లు తిరిగి రావటం! మేముండే ఇల్లు బంగళా. చుట్టూ చక్కని పూలచెట్లు. సాయంకాల మయేసరికి చల్లని పిల్లగాలులు మోసుకు వచ్చే రకరకాల సువాసనలు ....

....ఇదుగో! ఇక్కడ ఎడమవైపు మలుపు తిరగాలి. ఈ వీధిలో మరో ఫర్లాంగు దూరంనడిస్తే మేము అద్దెకుంటున్న ఆ రెండతస్తుల భవనం వస్తుంది. పాపం, సావిత్రి ఇంత పొద్దుపోయినా నే 'నింకా ఇంటికి చేరుకోలేదు ఎందుచేతనా?' అని ఆదుర్దాగా ఎదురు చూస్తుంది కాబోలు! పిల్లలు నిద్రపోయారో లేదో? ఆ చిన్న వెధవకు కోరింత దగ్గు. అస్తమానం దగ్గి దగ్గి కానుగ పుల్లవలె తయారయినాడు. మొన్న ఆదివారంనాడు సావిత్రి వాణ్ణి అవతల వీధిలో ఎవరిదగ్గరికో తీసుకువెళ్ళి. పసుపుతాడు వేయించుకు వచ్చింది. అది పనిచేస్తే యీ పేళకి దగ్గు తగ్గేవుండాలి. అయినా మన చాదస్తం కానీ. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? రాలితే ఎంత బాగుండును! అప్పుడు నేను కూడా ప్రమోషన్ కోరి ఒకటి కాదు నాలుగు పసుపు తాళ్ళయినా వేయించుకుంటాను.

నేను కన్న ఆ కలలన్నీ ఎలా ఫలించాయి? నా ఉద్యోగం సంగతి

సాధ్యమైనంత వరకూ తల్చుకోకుండా వుండడం మంచిది. లెక్కకు నాలుగే నాలుగు ఫ్యానులున్న ఆ పెద్దహాలులో నాటుచెక్క బల్లలమీద పేరుకుపోయిన ఫైళ్ళ పర్వతాలముందు కళ్ళను మోసంచేసే అంకెల కీకారణ్యంలో చిక్కుబడిపోయాను. నా మీద ఎంతోమంది అజమాయిషీ. "ఆ పని పూర్తి కాలేదే?" "ఈ ఫైలెక్కడ?" అని అదలించేవారూ, "నీకు జీతం యివ్వడం పనిచేసేందుకయ్యా! తీరిగ్గా కూర్చునేందుక్కాదు" అని మాటి మాటికీ గుర్తు చేసేవారూ బోలెడంతమంది. ఉండి ఉండి మా ఆఫీస రెప్పుడో నన్ను పిలుస్తాడు. ఆయన పిలిస్తేచాలు. నాకు కాళ్ళల్లో వణుకు గుండెల్లోదడ ప్రారంభమవుతాయి. స్వింగ్‌డోర్ తెరుచుకుని భయం భయంగా చేతులు కట్టుకుని, పెద్దపులిముందు మేకపిల్లలా నిలబడతాను. ఆయన ఏదో అడుగుతాడు. "ఎస్ సార్" అనితప్ప నానోటవెంట మరో మాట రాదు. ఆ ఏర్‌కండిషన్ గదిలో ఆఫీసరు కూర్చున్న రాకింగ్ చైరూ, ఆ ఖరీదయిన రోజ్‌వుడ్ బల్లమీదవున్న అందాలుచిందే వస్తు సముదాయమూ, ప్రక్కనే టీపాయ్‌మీదవున్న ఫ్లవర్‌వాజ్ ఇవేవీ గమనించే స్థితిలో నేనుండను. ఇప్పుడేకాదు. ఇరవయ్యేళ్ళనుంచీ జరుగుతున్నదే యిది!....

సరే! రెండోకల ఎలా ఫలించింది? మా బామ్మ "నేనింక ఎక్కువ రోజులు బ్రతకనురా! ముసలిముండనయినాను. నువ్వొక ఇంటివాడవయితే చూసి కళ్ళుమూస్తాను" అన్నది.... అబ్బో! ఇదెప్పటిమాట? దాదాపు పద్దెనిమిదేళ్ళయింది. అప్పుడందరూ హడావుడిపడి ఎక్కడో పిల్లనుచూసి ముడిపెట్టేశారు. వెంటనే సావిత్రి కాపురానికి వచ్చింది. మా బామ్మ మాత్రం మా పల్లెటూళ్ళో యింకా రాయిలా తిరుగుతున్నది. అప్పుడప్పుడు మా యోగక్షేమాలు విచారిస్తూ, మా ఆరుగురు పిల్లలను ఆశీర్వదిస్తూ ఉత్తరాలు వ్రాయిస్తూ వుంటుంది.

మేముండే ఇంటి సంగతి తల్చుకోనే అక్కర్లేదు. ఆ రెండం తస్తుల పెద్ద భవనంలో ఎన్ని కాపురాలున్నాయో తెలీదు. అన్ని వాటాలూ ఒక్కలాగే వుంటాయి. ఒక చిన్నగది. వెనుక వంటకు ఒక చిన్న రేకుల షెడ్డు — పక్క వాటాకూ, మా వాటాకు మధ్యలో ఒంటిరాయి ఇటుక గోడ. పైన ఒకచిన్న అటక, ఆ అటకమీదనే మా తాలుకు ఒకే ఒక్క పాత ఉయ్యాల వుంటుంది. నేనిప్పుడు ఇంటికి పోతానా, ఆ చిన్నగదిలో పిల్లలందరూ జంపఖానాలు పరుచుకుని పడుకొని నిద్రపోతుంటారు. వారి మధ్య దోవచేసుకుని, వెనుక షెడులోకివెళ్ళి భోంచేయాలి.

సావిత్రి!....ఆమెను తల్చుకుంటే నాకు చిత్రంగా వుంటుంది. మొదట్లో అందంగానేవుండేది. ఏమాటకూ ఎదురు చెప్పేదికాదు. కానీ ఇటీవల పిల్లలమీద విసుక్కోవడం, అప్పుడప్పుడూ కొట్టటం సాగిస్తున్నది. మనిషిలో విసుగు ఎక్కువయింది. సరే, దానికి మనమేం చెయ్యగలం? సరిపెటుకోక తప్పదు....

అదుగో దూరంగా మా భవంతి. ఇంకాకొన్ని వాటాల్లోలైట్లు వెలుగుతున్నాయి. ఎవరెవరో ఆఫీసు ఫైళ్ళు ఇంటికి మోసుకు వచ్చి పని చేస్తున్నారుకాబోలు!

.... ఆ సినిమాలో హీరో హీరోయిన్‌తో మాట్లాడేటప్పుడు మాటి మాటికీ "నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో తెలుసా వసంతా?" అన్నాడు.

అది గుర్తురాగానే గతుక్కుమన్నాను. నడుస్తూనే ఆశ్చర్యంతో తల మున్కలయినాను. కోటుజేబులోనుంచి మాసిన రుమాలుతీసి నుదురు తుడుచుకున్నాను. నాకు హఠాత్తుగా ఒక విషయం స్ఫురించింది. ఇన్ని ఏళ్ళుగా కాపురం చేస్తున్నా నేనొక్కసారికూడా సావిత్రితో, "నిన్నెంతగా

ప్రేమిస్తున్నానో తెలుసా సావిత్రీ!" అని అన్నట్లు గుర్తులేదు. "ఆ మాట అనకుండా ఇన్నిఏళ్ళు ఎలా గడిచిపోయాయా?" అని ఆశ్చర్యంవేసింది.

నేను మా రెండంతస్తుల భవంతిముందు ఒక్కక్షణం ఆగాను. మనసులో కల్లోలం చెలరేగింది, తలవూపి "ఏమైనాసరే, ఈ వేళ ఆ మాట అనితీరాలి!" అని నిశ్చయంతో నెమ్మదిగా సింహద్వారం తెరుచుకుని లోపల అడుగు పెట్టాను. ఎవరి వాటాలోదో ఒక కుక్క "భౌ" మంటూ మీదికి రాబోయి మళ్ళీ అంతలోనే ఆగిపోయింది. కుక్క అరుపు విని వరండాలో ప్రక్కగా మంచం వేసుకుని పడుకునివున్న ఒక మనిషి తలఎత్తి చూచి అంతలోనే మామూలుగా సరుకుని పడుకున్నాడు. నేను వరండాలో ఎడమవైపు తిరుగుతూవుండగా ఆ వాటాలో అద్దెకుండేవారి పిల్లవాడు—పద్ధెనిమిదేళ్ళ వాడొకడు నన్నుచూచి పళ్ళికిలిస్తూ నవ్వాడు. వాడికి పిచ్చి.

నేను స్థిర నిశ్చయంతో మా వాటావైపు నడిచాను. ఇవాళ ఏమయినాసరే, నా భార్యతో ఆ మాట అనితీరాలి....

సావిత్రి గుమ్మంలోనే కూర్చునివుంది నన్ను చూసి, లేచి నిలబడింది. నేను నవ్వుతూ లోపలికి వెళ్లాను. పిల్లలందరూ వరుసగా పడుకొని వున్నారు. నేను చొక్కా విప్పుతూ. సావిత్రి వంక తిరిగి" పిల్లలందరూ పడుకున్నట్టేనా?" అన్నాను.

సావిత్రి నవ్వుతూ చొక్కా అందుకుని వంకెకు తగిలించి, నావైపు తిరిగింది. "వాళ్లు పడుకుని చాలాసేపయింది. ఇదుగో, ఆ చిన్నవాడే ఇప్పటిదాకా దగ్గుతూ యిప్పుడే పడుకున్నాడు. అయినా ఇవాళ మీకింత ఆలస్యమైందేం?" అన్నది.



కథా నిలయం
శ్రీకాకుళం

ఆమె ప్రసన్నంగానే వుంది. ఆలస్యంగా వచ్చినందుకు సణుగుతుందనీ, కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుందనీ. "పెళ్ళాం పిల్లలు ఏమౌతారోనన్న ఆలోచనైనాలేదు. మీది రాతిగుండె" అని సాధిస్తుందనీ అనుమానించాను. ఆ సూచనలేవీ లేక పోవడంతో నాలో హుషారు పెల్లుబికింది. చిన్న పెరటిలో కాళ్లుకడుక్కుంటూనూ, యివతలికి వచ్చి భోజనం చేస్తూనూ, సావిత్రితో ఎన్నో కబుర్లు చెప్పాను. వీరాంజనేయులు సన్నగా ములక్కాడలా వుండి, గాలి విసురుకు పడిపోతున్నట్లు ఎలా తూలుతూ నడుస్తాడో చెప్పాను. అతనికి ప్రమోషన్ రావడంలో అంతరార్థం ఏమిటో చెప్పాను. అతనికి "కాశారాయుడ"ని ఆఫీసులో పేరుండటం గుర్తుచేసుకుని మరీ చెప్పాను. ఆఫీసర్ల బూట్లుపాలిష్ చేస్తాడనీ. వారికి ఇంటి పనులన్నీ చేసిపెడతాడనీ. కావలిస్తే బుజు విప్పిస్తాననీ చెప్పాను. అన్నీ చెప్పి చివరకు, "ఇటువంటి అడ్డదార్లు తొక్కడం అంటే మనకు పడదు. ముక్కుకు సూటిగా పోతాం.... మనపని ఏదో మనం చేసుకుంటాం.... లక్షలకు లక్షలు గడించక పోతేనేం.... నీతి నిజాయితీ ముఖ్యం?.... ఏమంటావ్?" అన్నాను.

సావిత్రి నవ్వుతూ అన్నీ విన్నది. ఆమెను చూస్తూంటే నాకు చాలా ఆనందం కలిగింది. నా చిన్ననాటి బంగారు కలల్లో ఏదో ఒక చిన్న అంశం ఫలించినట్టే అనిపించింది.

నేను చేతులు తుడుచుకుని ముందుగదిలోకి వచ్చాను. నెమ్మదిగా పిల్లలకు నిద్రాభంగం కలుగకుండా ఒక పక్కకు చేరి వెల్లకిలా పడుకున్నాను. మరికొద్ది నిమిషాలలో పని ముగించుకుని సావిత్రి చేతులు తుడుచుకుంటూ వచ్చింది. ఆమెను నా పక్కకు వచ్చి కూర్చోమని సైగ చేసి చుట్టూ చూశాను. పిల్లలు మంచి నిద్రలో వున్నారు. సావిత్రి నవ్వుతూ వచ్చి నా పక్కకు కూర్చున్నది. ఏదో చెప్పదల్చుకున్నట్టు చీరెకొంగు వ్రేలికి చుట్టుకుంటూ "ఏమండీ!" అన్నది.

నేను హఠాత్తుగా ఆమెను దగ్గరికి తీసుకుని "నే న్నిన్నెంతగా ప్రేమిస్తున్నానో తెలుసా సావిత్రీ!" అని ఆమె కళ్ళలోకి చూశాను. సావిత్రి అంతలో కంగారుపడి అయోమయంగా నా వంక చూసింది. క్షణంలో ఇద్దరం సర్దుకుని కూర్చున్నాము. కొద్దిగా కదిలిన చిన్నవాణ్ణి జోకొడుతూ సావిత్రి అంతలో నవ్వి "ఏమిటండీ ఆ మాటలు...." అన్నది.

నేను ఉత్సాహంతో పొంగిపోతున్నాను. "అన్నట్టు నీవిందాక ఏదో చెప్పబోయావు.... ఏమిటది? చెప్పేయ్!.... ఏమైనా వింటాను." అన్నాను. సావిత్రి నాకు కొంచెం దగ్గరగా జరిగింది. అంతలోనే సిగ్గుపడుతూ, "మీకు కోపం వస్తుందేమోబాబూ! అయినా వారం రోజులనుంచీ ఎట్లా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను" అన్నది.

నేను ఆమెకు ధైర్యం చెప్పాను. "దాన్దేముందీ? మనసులో మాట చెప్పేయి! లేకపోతే యింకెలాగ? నేను చూడు. నిన్నెంతగా ప్రేమిస్తున్నానో చెప్పదల్చుకున్నాను. చెప్పేశాను. అలాగే నువ్వూ నీ మనసులో మాట చెప్పు....' 'మిమ్మల్నెంతగా ప్రేమిస్తున్నానో తెలుసా' అనేసెయ్.... ఏం ఫర్వాలేదు."

ఆమె మతి పోయినట్టు చూసింది. "ఏమిటా మాటలు? పాడు సినిమాల్లోలాగా.... నేను చెప్పదల్చుకున్నది అది కాదండీ" అన్నది. "ఊఁ! కమాన్! చెప్పేయ్" అన్నానునేను.

ఆమె కొద్దిక్షణాలు ఆలోచించింది. మందమైన లైటు వెలుగులో ఆమె ముఖంలోని భావాలను నేను చదవలేకపోయాను. అర నిమిషం నిశ్శబ్దంగా గడిచింది. ఆమె పైకి చూసి చూపుడు వ్రేలు చూపి, "అదుగో! ఆ అటకమీద ఉయ్యాలవుంది చూశారూ! దాన్ని క్రిందికి దించండి. దులిపి వుంచుదాం ముందు ముందు అవసరం" అన్నది.

నేను తటాలునలేచిఈలవేస్తూ "ఓ యస్! దానికేం మహాభాగ్యమా! ఈ చిన్న విషయాని కింతగా నీళ్ళు నమిలితే ఎలా చెప్పు సావిత్రీ" అంటూ ఆ కర్రమెట్లు ఎక్కాను. పైన అటకమీద పాత ఉయ్యాల వుంది. దాన్ని ఇవతలికి లాగి, "అబ్బ! దీన్ని తుడిచి శుభ్రం చెయ్యడం పెద్ద పనే ...." అనుకుంటూ వుండగా ఎలక్ట్రిక్‌షాక్ తగిలినట్టయింది. ఆ నిచ్చెన చివరి మెట్టుమీదినుంచీ సావిత్రి వంక చూశాను. "ఏమిటే నిజం గానే? మళ్ళీ...." అని కేక పెట్టాను. సావిత్రి నవ్వి తలవంచుకుంది.

నేను నీరసంగా మెట్లుదిగి వచ్చాను. క్రింద కూలబడి సావిత్రి వంక చూశాను. చుట్టూ అడ్డదిడ్డంగా పడుకుని వున్న పిల్లల వంక చూశాను.

మళ్ళీ సావిత్రి వంకచూశాను. ఆమె అనునయంగా నాభుజంమీద చేయివేసింది.

నే నామె చేతిని విదిలించికొట్టాలనుకున్నాను. కానీ అలాచేయ లేదు. మెత్తని చేతిని చెంపల కానించుకున్నాను. సావిత్రి నవ్వింది. నేనూ నవ్వడానికీ, హుషారుగా ఈల వేయడానికీ ప్రయత్నించాను. కాని విఫ లుణ్నయ్యాను.

——///——